భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘం నాయకులు

సుభాష్‌నగర్: దూలపల్లిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధుల కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిని శనివారం దళిత సంఘాల నాయకులు కోరారు. గ్రామంలో అంబేడ్కర్ భవనం నిర్మాణం పూర్తయితే ఎంతో మందికి ఉపయోగపడుతుందని తెలిపారు. అందుకు ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, వారం రోజుల్లో నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో గడ్డం ప్రసన్నకుమార్, నరేష్, అనిల్, తిరుపతి, నవీన్, ఋషి తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలందించేందుకు కృషి

కుత్బుల్లాపూర్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీజీఏఐఎంఎస్ యాప్ ద్వారా విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు పనితీరును పరిశీలిస్తున్నామని, పనిచేయని యంత్రాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో 12 బృందాలు టీజీఏఐఎమ్ఎస్ యాప్ ద్వారా సర్వే నిర్వహించనున్నామని, ఈ నెల 24 నుండి జరిగే సర్వేలో ఏఈ, సిబ్బంది, సబ్ ఇంజనీర్లు సభ్యులుగా ఉంటారన్నారు. ప్రస్తుతం 11కేవీ, 33 కేవీ లైన్ల పరిధిలో సర్వే చేయనున్నామని డీఈ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎంపీ ఈటల రాజేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు

నిజాంపేట్: యువతకు ఉద్యోగావకాశాలతో పాటు స్థానికంగా వైద్యం, విద్య, మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో బీజేపీ నాయకులు ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈటలకు మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషి వల్లే తన గెలుపు సాధ్యపడిందన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, సతీష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'సమస్యలను పట్టించుకోని అధికారులు'

మూసాపేట: కూకట్‌పల్లి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌కు కూకట్‌పల్లి యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ శనివారం కూకట్‌పల్లి, మూసాపేట టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కూకట్‌పల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. పరిమితికి మించి భవన నిర్మాణాలు చేస్తున్నా కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వలన ఈ సమస్యలకు కారణమన్నారు. 100 నుంచి 300 గజాల పరిమితికి మించి అంతస్తులు నిర్మిస్తున్నా అందులో కనీసం పార్కింగ్ లేకున్నా 5, 6 అంతస్తులు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇలా నిర్లక్ష్యం చేయటం వల్ల ప్రతి సంవత్సరం వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుభాష్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని గాజులరామారం శ్రీనిధి గ్లోబెల్ స్కూల్ చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వర రావు అన్నారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రిన్సిపాల్ హైమముద్రిక ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు మొక్కలను అందజేసి పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడ్రన్ కల్యాణ మండపంలో ఆధార్ కేంద్రం



చింతల్: చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్ లోని మోడ్రన్ కళ్యాణ మండపంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో నూతన ఆధార్‌తో పాటు ఆధార్ కార్డులోని తప్పులు సవరణ చేసుకునేందుకు వెసులుబాటు ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆధార్ కేంద్రం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళ్యాణమండపం లోపల అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 8686774677 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

వర్షాకాలం భయం.. భయం



- వరద సమస్యతో స్థానికుల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



వర్షాకాలంలో ఓక్షిత్ కాలనీ (ఫైల్)

నిజాంపేట్/సుభాష్‌నగర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాలు బండారి లేవుట్, పూజిత లేఅవుట్, రెడ్డి అవెన్యూ, అదిత్యగార్డెన్ లాంటి ప్రాంతాలు భారీ వర్షాలకు నీట మునిగేవి. ప్రధానంగా వందలాది అపార్ట్‌మెంట్లు ఉన్న బండారి లే అవుట్‌కు ప్రతి సారీ వర్షాకాలంలో వరద ముంపు ఉండేది. కాని ప్రస్తుతం వరద నీరు దిగువకు పోయేందుకు అధికారులు నాలా పనులను పూర్తి చేశారు. అదే విధంగా తుర్క చెరువు అలుగును సైతం తగ్గించడంతో బండారి లేవుట్‌కు ముంపు తీవ్రత తగ్గింది. భారీ వర్షాలు కురిసిన సమయంలో రెండు మూడు రోడ్లపై వరద నీరు తక్కువ స్థాయిలో నిల్వ ఉంటుంది. ఇక సెల్లార్‌లలోకి అయితే నీరు వస్తుంది. రెడ్డి అవెన్యూలో సైతం వదర నీరు నిల్వ ఉంటుంది. బండారి లేఅవుట్‌కు ఈ కాలనీ దిగువ ఉండటంతో రోడ్లపై వరద సమయంలో నీరు నిల్వ ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు పెద్దగా చేయాల్సిన పని ఏమి లేదు. బాచుపల్లి లోని పూజిత లేవుట్ , కేకేఎం కాలానీలు , అదిత్య గార్డెన్ లాంటి కాలనీలు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి ప్రతి సారి వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఈ కాలనీల్లో గతంతో పోల్చితే ఇప్పటికి ఈవదర నీరు నిల్వ ఉండకుండా చేపట్టాల్సిన చర్యలు ఏమి తీసుకోలేదు. ఎలాంటి ప్రత్యామ్నాయాలు చపట్టలేదు. వర్షం పడ్డ ప్రతి సారి ఈ సమస్య పునరావృత్తం అవుతూనే ఉంది.

గాజులరామారం డివిజన్‌లో....

గాజుల రామారం డివిజన్‌లోని పెద్ద చెరువు దిగువన ఉన్న ఓక్షిత్ ఎంక్లేవ్ 1,2 కాలనీలు గత 5 సంవత్సరాల క్రితం వెలిశాయి. ఈ కాలనీని అనుకుని సుమారు 30 ఫీట్ల నాలా ఉంది.కొంత మంది నాలా స్థలంలో కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో భారీ వర్షాలకు కురిసిన సమయంలో కాలనీలు జలదిగ్బందం అవుతున్నాయి. అధికారులు మాత్రం ప్రత్యామ్నాయంగా రూ. 18 కోట్ల నిధులతో 500 మీటర్ల పొడవు కృత్రిమ నాలా నిర్మాణానికి తెరలేపారు. కబ్జాకు గురైన నాలాను వదిలేసి పనులు పక్కనుంచి చేపట్టడంతో స్థానికులు పనులను అడ్డుకున్నారు. స్థానికులు గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయింది. ఇక్కడ కూడా వర్షం పడ్డ ప్రతి సారి రోడ్లన్నీ జలమయం అవుతాయి. అధికారులు మాత్రం పూర్తి స్థాయిలో పరిష్కార మార్గాలు చేపట్టలేదు.





బాచుపల్లి అదిత్యగార్డెన్‌కాలనీలో ఇండ్ల ముందు వర్షం నీరు



అదిత్యగార్డెన్‌లో వరద నీరు నిల్వ ఉండకుండా ఎలాంటి పనులు చేపట్టని దృశ్యాలు

ఇదేమి న్యాయం



గత రెండు సంవత్సరాలుగా వర్షం నీటిలో పడరాని పాట్లు పడుతున్నాం. నాలా కబ్జాకోరులను వదిలేసి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కళ్ళ ముందు నాలా కబ్జా జరుగుతుంటే అధికారులు అడ్డుకోవాల్సింది పోయి. కబ్జాకోరులకి వత్తాసు పలుకుతున్నారు.ఈ విషయమై కోర్టుకు వెళ్తాం.

– సుర్వరాజు, ఓక్షిత్ కాలనీ

వర్షాకాలం వస్తోందంటే భయం



ఎవరో కట్టు కాలువను కబ్జా చేస్తే వారి మీద చర్యలు తీసుకోవాల్సింది పోయి. మధ్య నుంచి మరో నాలాకు పనులు చేపట్టడేమిటో అర్థం కావడం లేదు. మా ఇండ్ల మధ్య నుంచి మూడు మీటర్ల కృత్రిమ నాలా కోసం తవ్వకాలు చేస్తుంటే ప్రహరీలు కూలిపోతున్నాయి.వర్షకాలం వస్తుదంటే భయంగా ఉంది.

– శివకుమార్

నీటి వాడకం ఇష్టానుసారం..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నీరు వృథా అవుతోంది. ముఖ్యంగా సోమయ్యనగర్‌లో నిత్యం వరదలా పారుతున్నాయి. చాలా మంది నీటితో ఇంటిముందు వాహనాలు కడుగుతున్నారు. ఇలా చేస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెప్పినా తమకేం సంబంధం లేదని కొందరు ప్రవర్తిస్తున్నారు. వాహనాలు కడగడంతో పాటు ఇంటిలో ఉన్న ట్యాంకులకు కూడా వాల్వ్ బిగించుకోకపోవడం కూడా మరొక కారణంగా చెప్పవచ్చు. ట్యాంక్ నిండిన తర్వాత నీటిని రోడ్లపై వదులుతున్నారు. దీంతో స్థానికంగా వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ అధికారి ఝాన్సీని వివరణ కోరగా త్వరలోనే ఒక టీంని ఏర్పాటు చేసి నీటిని వృథాగా వదులుతున్న వారికి నోటీసులు, జరిమాన విధిస్తూ దీన్ని అరికడతామని తెలిపారు.



రోడ్లపై వరదలా పారుతున్న తాగునీరు

ఆలోచింపజేసిన విద్యార్థుల ఆవిష్కరణలు



విద్యార్థికి ప్రోత్సాహక నగదు పురస్కారాన్ని అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలకు చెందిన ఇంజనీర్స్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఐడియేట్ ఇన్నోవైట్ ఇగ్నైట్స్ ఈవెంట్ శనివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఈ ప్రాంతీయ ఫోరమ్ ద్వారా సమకాలిన సవాళ్లకు వినూత్న పరిష్కార మార్గాలు అన్వేషించడానికి పరిశ్రమ నిపుణులు, విద్యార్థులను ఒకే చోట చేర్చి విజయవంతంగా ఈవెంట్‌ను ముగించామన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేందుకు, విద్యార్థుల్లో సహకారాన్ని పెంపొందించేందుకు ఈ ఫోరమ్ దోహద పడుతుందన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణల ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్ట్‌ల్లో అత్యుత్తమైన నమూనాకు రూ.15 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్మార్టర్ ధర్మ కో ఫౌండర్ మనోజ్‌కుమార్, ప్రొఫెసర్ రాధికదేవి, మహేందర్, హారిక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆరు నెలల అద్దె రుసుం మంజూరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన 26 నెలల అద్దె రుసుమునకుగానూ ఇప్పటి వరకు ఆరు నెలల అద్దె రుసుం మాత్రమే మంజూరైనట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న 'సాక్షి' మినీలో 'అవస్థల్లో అంగన్‌వాడీలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అద్దె రుసుం కోసం బిల్లులు సమర్పించామని, ఇంటి యాజమానుల ఖాతాలో డబ్బులు జమ కాగలవని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏప్రిల్ 2024 వరకు గౌరవ వేతనం చెల్లించామని, మే నెలకు సంబంధించిన వేతనం అందజేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలోని అన్నీ అంగన్వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు, గ్యాస్ బిల్లులకు సంబంధించి ఫిబ్రవరి 2024 వరకు చెల్లించామని తెలిపారు. ఇంకా మూడు నెలలకు సంబంధించిన కూరగాయలు, గ్యాస్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, పూర్తయిన వెంటనే వినియోగంలోనికి తీసుకోస్తామని తెలిపారు. మరికొన్నింటికి కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు కాగా, ఈ పనులను పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమాచారాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. మారరా ?

రంగారెడ్డినగర్: రాంగ్‌రూట్ డ్రైవింగ్‌లతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు.. ప్రధాన రోడ్ల వెంబడి యూటర్న్‌లు కాస్త దూరంగా ఉండటంతో రోడ్డు దాటేందుకు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘలనలకు పాల్పడుతున్నారు. ఐడీపీఎల్ చౌరస్తా నుండి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ చౌరస్తా వరకు ఒక చోట మాత్రమే యూటర్న్ ఉంది. అది కూడా ఐడీపీఎల్ చౌరస్తా సమీపంలోనే ఒక యూర్న్ ఉండగా గణేష్ నగర్ నాలాకు అటు ఇటుగా ఉన్న కాలనీలు, బస్తీల ప్రజలు యూటర్న్ తీసుకోవాలంటే కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా వరకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో కొంత మంది ద్విచక్ర వాహనదారులు అంత దూరం వెళ్లలేక రాంగ్ రూట్‌లలో ప్రయాణించి ఐడీపీఎల్ చౌరస్తా సమీపంలో రోడ్డు దాటుతున్నారు. సమీపంలోనే ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా వారిని మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. చింతల్– కుత్బుల్లాపూర్ రోడ్డు మార్గంలో మరో యూటర్న్ ఏర్పాటు చేస్తే రాంగ్ రూట్ డ్రైవింగ్‌లను కట్టడి చేయవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



శ్రీసాయినగర్ సమీపంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహనదారుడు

శివశివాని కళాశాలకు అంతర్జాతీయ గుర్తింపు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలకు అసోసియేషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ సౌత్ ఆసియా (ఏఎండీఐఎస్ఏ) ద్వారా ప్రతిష్టాత్మక ఎస్ఏక్యూఎస్ ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించింది. ఈ ప్రతిష్టాత్మక అక్రిడిటేషన్ పొందిన కళాశాలల్లో హైదరాబాద్‌లోని మొదటి ఐదు బి–స్కూళ్లలో శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఒకటని, ఈ అక్రిడిటేషన్ మూడేళ్ళ పాటు కొనసాగుతుందని కళాశాల చైర్మన్ ఆర్తి సంపతి తెలిపారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా శ్రీహరి



నియామక పత్రం అందుకుంటున్న సిరిపంగి శ్రీహరి

జగద్గిరిగుట్ట: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా జగద్గిరిగుట్టకు చెందిన సిరిపంగి శ్రీహరి నియమితులయ్యారు.ఈ మేరకు గాంధీ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శివసేనా రెడ్డి నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధ్యక్షులు శివసేనా రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కన్వీనర్ బాలయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

భవిత కేంద్రం ప్రారంభం

సుభాష్‌నగర్: మానసిక వికలాంగుల అభ్యున్నతికి నూతనంగా భవిత కేంద్రాన్ని శనివారం షాపూర్‌నగర్‌లో ప్రారంభించారు. ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. అధికారులు మాట్లాడుతూ 3 నుండి 18 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఈ కేంద్రంలో విద్యతో పాటు వారి మానసికస్థితిగతులను మెరుగుపరిచేందుకు శిక్షణ ఇస్తామన్నారు.

'సెయింట్ మార్టిన్' విద్యార్థుల వందశాతం ప్లేస్‌మెంట్



సమావేశంలో పాల్గొన్న సెయింట్ మార్టిన్ విద్యార్థులు, యాజమాన్యం

సుభాష్‌నగర్: వంద శాతం ప్లేస్‌మెంట్ సాధించి సెయింట్ మార్టిన్ కళాశాల హాట్రిక్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా పేర్కొన్నారు. శనివారం కళాశాలలో వంద శాతం ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులతో సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ మీట్‌కు మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, ఏహెచ్ఎం గ్రూప్ డైరెక్టర్ బాలకృష్ణలు పాల్గొన్నారు. అనంతరం ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులను ఉద్దేశించి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో 1168 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ లభించాయని, వంద శాతం ప్లేస్‌మెంట్స్‌తో సెయింట్ మార్టిన్ విద్యార్థులు సరికొత్త రికార్డును నెలకొల్పారన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్

నిజాంపేట్: రాంగ్ రూట్ డ్రైవింగ్తోపాటు ధృవ ప్రతాలు లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ అన్నారు. శనివారం మియాపూర్ హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్, కోకకోలా కంపెనీ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో వెళ్తున్న 18 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన ప్రశాంత్ మాట్లాడుతూ చాలా వరకు ప్రమాదాలు రాంగ్ రూట్ డ్రైవింగ్‌ల వల్లే చోటు చేసుకుంటున్నాయని, దీనిపై సీరియస్‌గా తీసుకుని పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో సిబ్బంది అనీల్, మల్లేశ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: వినాయకరావు నగర్‌లో నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ డా. పి. శ్రీనివాస్ అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో నవీన్ రెడ్డి శ్రీ తేజ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో ప్రజాధనం దుర్వినియోగం

చింతల్: అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చింతల్ డివిజన్ స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్ వెనకాల నుండి వచ్చే నాలా దుర్గయ్యనగర్ వద్ద ఇటీవల ప్రహరీ గోడ కూలిపోయింది. ఈ ఓపెన్ నాలా ప్రహరీ కూలిన ప్రాంతం రోడ్డుకు సమీపంలో ఉండటంతో ప్రమాదకరంగా మారింది. దీంతో అధికారులు ఇటీవల సదరు నాలా రిటైనింగ్ వాల్‌ను పునరుద్ధరించే ఏర్పాటులో భాగంగా ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ గోడ నిర్మించిన సదరు కాంట్రాక్టర్ క్యూరింగ్ చేపట్టకుండా గాలికి వదిలేశాడు. భారీ వర్షం వస్తే నీటి ప్రవాహ ఉధృతికి ఇప్పుడు నిర్మించిన భాగం కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నప్పటికి ఇంజనీరింగ్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారనే విమర్శలు వినిపిస్తు న్నాయి. అధికారులు స్పందించి గోడల నిర్మించిన ప్రాంతంలో క్యూరింగ్ కోసం నీటిని పోయాలని నాలా పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



నాలా వాల్‌కు క్యూరింగ్ చేయని దృశ్యం..

కలుషిత నీటి సమస్యను పరిశీలించిన అధికారులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ నేతాజి కాలనీ జాన్సన్ గ్రామర్ స్కూలు వీధిలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, జలమండలి మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి సమస్యని అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా సరఫరా అవుతున్న కలుషిత నీటిని వారు చూపించారు. కలుషిత నీటి సమస్యలను నాలుగైదు రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతాజి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి వెంకట రాంనర్సయ్య, స్వామి, శేఖర్ గట్ల, సురేందర్ నాయుడు, పద్మావతి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

గంటలోపే ఆచూకీ కనుక్కున్న పోలీసులు

మోతీనగర్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటలోపే వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సామల వెంకటరెడ్డి తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మల్లేష్ కుటుంబ సభ్యులు అల్లాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లోని ఈ బ్లాక్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం మల్లేష్ కుమారుడు అమర్ కుమార్ ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి సుమారు గంటలోపే అమర్‌కుమార్‌ను గాలించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, స్థానికులు వెంటనే స్పందించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



తప్పిపోయిన బాలుడితో తల్లిదండ్రులు